రైల్వేకోడూరులో రూ.5 కోట్లకు ఐపీ?

- దుకాణాలను తెరవని ఇద్దరు వ్యాపారులు
- ఆందోళన చెందుతున్న వడ్డీ వ్యాపారులు

రైల్వేకోడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో ఇరువురు వ్యాపారులు ఐపీ పెట్టనున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని ప్రధాన దారిలో ఉన్న రెండు దుకాణాలు సుమారు 20 రోజులుగా తెరుచుకోలేదు. దీంతో వారికి వడ్డీకి డబ్బులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. రెండు బట్టల దుకాణాల వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి రైల్వేకోడూరుకు వచ్చి బట్టల వ్యాపారం చేసేవారు. వ్యాపారం జరగకపోవడమా, వడ్డీలు అధికమైనందున డబ్బులు కట్టలేకనో దుకాణాలు మూసివేసి ఐపీ పెడుతున్నట్లు పట్టణంలో చర్చించుకుంటున్నారు. వడ్డీ వ్యాపారులు కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు అధిక వడ్డీకి ఆశపడి డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. ఐపీ నోటీసులు ఇంకా వడ్డీ వ్యాపారులకు అందలేదని తెలిసింది. నేడో రేపో నోటీసులు వస్తాయని ఆదివారం తెలియవచ్చింది. సుమారు రూ.5 కోట్లకు పైగా ఐపీ పెట్టనున్నట్లు తెలిసింది.



లక్కిరెడ్డిపల్లె మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు (ఫైల్)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం వల్ల నిజంగా ప్రజలు పనులు చేసి లబ్ధి పొందుతున్నారో..? లేదో? కానీ.. మండల, గ్రామ స్థాయి చోటామోటా నాయకులు, ఉపాధి పథకానికి చెందిన పలువురు అధికారులు మాత్రం బాగా లబ్ధి పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కోట్ల రూపాయల వ్యయంతో ఉపాధి పనులు జరుగుతుండగా.. అందులో కేవలం లక్షల రూపాయలు మాత్రమే అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలలో బయటపడుతుండడమే ఉదాహరణగా చెప్పవచ్చు. ఉపాధిలో జరిగిన అక్రమాలను మట్టిలో కప్పిపెట్టడానికి సామాజిక తనిఖీ ఉపయోగపడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ పథకం అమలులో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నా సామాజిక తనిఖీ మాత్రం ఫీల్‌గుడ్ అనే రీతిలో సాగుతుండడం విశేషం.

మట్టిలో కలిపేస్తున్నారు..!



- ఉపాధిలో రూ.కోట్లలో అక్రమాలు..
- వేలల్లో నామమాత్రంగా రికవరీ
- ఉత్తుత్తి సామాజిక తనిఖీలు
- మట్టిలో కలిసిపోతున్న ఉపాధి అక్రమాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఉపాధికి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో సామాజిక తనిఖీ నిర్వహించారు. పుల్లంపేట మండలంలో మార్చి 13న జరిగిన సామాజిక తనిఖీలో పుల్లంపేట పంచాయతీలో ముగ్గురు వలంటీర్లు వంద రోజులు పని పూర్తి చేసినట్లు మస్టర్లల్లో పేర్లు రాసి నిధులు కాజేసినట్లు వెల్లడైంది. దీంతో రూ.45 వేలకు పైగా రికవరీకి ఆదేశించారు. అదేవిధంగా పుల్లంపేటలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్ సుమారు రూ.1.29 లక్షల అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీలో తేల్చారు. అయితే సదరు ఫీల్డ్ అసిస్టెంట్ సామాజిక వర్గానికి చెందిన, జిల్లాలో వేరే మండలంలో పనిచేస్తున్న ఏపీడీ ఆ మొత్తాన్ని రూ.500లోపే కుదించినట్లు సమాచారం. ఇదే మండలంలో 2022-23లో గల్ఫ్‌లో ఉన్న ఓ వ్యక్తి రోజూ ఉపాధి హామీ పథకం పనికి హాజరైనట్లు మస్టర్లలో రాసి నిధులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా సరైన చర్యలు లేవు.

లక్కిరెడ్డిపల్లె మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద పది కోట్ల రూపాయల పనులు చేశారు. వైసీపీ ప్రభుత్వం కావడంతో అప్పట్లో ఇష్టానుసారంగా పనులు చేసి బిల్లులు మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీకి వచ్చిన పలువురు అధికారులను డబ్బుతో కొనేశారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల సామాజిక తనిఖీ అధికారులకు సమర్పించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాబట్టే మండలంలో తూతూ మంత్రంగా సోషల్ ఆడిట్ జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే కొన్నిచోట్ల డబ్బు తీసుకున్నప్పటికీ అక్రమాలను బయటపెట్టారు. దీనిపైన డబ్బు చెల్లించిన ఫీల్డ్ అసిస్టెంట్లు మా దగ్గర డబ్బు తీసుకుని మళ్లీ బయట పెట్టారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇంత చేసి మండలం అంతా కలిసి కేవలం రూ.లక్ష మాత్రమే రికవరీకి ఆదేశించారు. ఇటువంటి పరిస్థితే జిల్లా అంతటా ఉంది.

రూ..కోట్లలో పనులు..

జిల్లాలో సగటున నెలకు రూ.10 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 15 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు జిల్లాలో రూ.37,23,17,973 పనులు జరిగాయి. జనవరి సగం నెలకే రూ.3,58,81,398లకు పనులు జరిగాయి. ఫిబ్రవరిలో రూ.16 కోట్లు, మార్చిలో రూ.12 కోట్లు, ఏప్రిల్‌లో 16వ తేదీ నాటికి రూ.4 కోట్ల విలువ చేసే పనులు జరిగాయి.

ఇందులో రాయచోటి ప్రాంతంలోని మండలాల్లో ఎక్కువగా పనులు జరిగాయి. అయితే ఇందులో చాలా వరకు పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడం.. కూలీలు పనికి హాజరు కాకపోయినా మస్టర్లలో వాళ్ల పేర్లతో దొంగ బిల్లులు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొన్ని మండలాల్లో కనీసం పనులు ఎంత జరిగాయో కొలతలు కూడా సక్రమంగా తీసుకోవడం లేదని, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా ఉన్నాయి. ఈ పనులను పర్యవేక్షించాల్సిన ఏపీడీలు ఫీల్డ్‌కు కూడా వెళ్లడం లేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఉపాధి పనులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

ఉపాధి పనుల్లో అక్రమాలను బయటపెట్టేందుకు సామాజిక తనిఖీని చేపడతారు. అయితే ఈ సామాజిక తనిఖీ జరుగుతున్న తీరుపైనే అనేక ఆరోపణలు ఉన్నాయి. సామాజిక తనిఖీకి వచ్చే పలువురు అధికారులు సైతం ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద నుంచి డబ్బులు తీసుకుని అక్రమాలను బయటపెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏడాదికి సుమారు రూ.150 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లకు పైగా వ్యయం చేసి ఉపాధి పనులు చేపట్టారు. అయితే 2022-23 సంవత్సరంలో కేవలం 18 లక్షలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.13 లక్షలు మాత్రమే అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బయటపెట్టడంపైన అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిలో జరిగిన అక్రమాలను మట్టిలో కప్పిపెట్టడానికి సామాజిక తనిఖీ ఉపయోగపడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ములకలచెరువు మండలంలో ఒక రూపాయి కూడా అక్రమాలు జరగలేదని సామాజిక తనిఖీలో తేల్చడం.. సామాజిక తనిఖీ నిబద్ధతపైన సామాన్యుల్లో ఉన్న అభిప్రాయానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

నామమాత్రంగా రికవరీ

ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రాకపోవడం ఒకటైతే.. వెలుగులోకి వచ్చిన అక్రమాల రికవరీలు కూడా నామమాత్రంగానే జరుగుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 18,90,390 రూపాయల రికవరీకి ఆదేశించారు. అందులో రూ.2,46,995 మాత్రమే రికవరీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 13,15,727 రూపాయలు రికవరీకి ఆదేశించగా.. కేవలం రూ.2,94,130 మాత్రమే చేశారు. దీనిని బట్టి జిల్లాలో ఉపాధి పనులు ఎలా జరుగుతున్నాయో? సామాజిక తనిఖీ, రికవరీలు ఏ మేరకు ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

సోషల్ ఆడిట్ సక్రమంగానే నిర్వహిస్తున్నాం

ఉపాధి పనుల సోషల్ ఆడిట్ సక్రమంగానే నిర్వహిస్తున్నాం. అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. లక్కిరెడ్డిపల్లె మండలంలో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీని సస్పెండ్ చేశాము. ఫీల్డ్ అసిస్టెంట్‌లు అందరి నుంచి రికవరీకి ఆదేశించాం. గాలివీడు మండలంలో ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీని సస్పెండ్ చేశాము.

-వెంకటరత్నం, డ్వామా పీడీ

శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండండి
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు శాంతిభద్రతల కోసం సహకరిస్తూ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ ఇంటికి గానీ మీ ప్రదేశాలకు వచ్చే అపరిచితులను గుడ్డిగా నమ్మవద్దని, వారి వివరాలను తెలుసుకుని అవసరమైతే పోలీసులకు తెలియజేయాలన్నారు. మీ విలువైన వస్తువులు, నగలు, డబ్బు, ముఖ్యమైన పత్రాలను సురక్షితమైన స్థలంలో ఉంచాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్‌ల పట్ల జాగ్రత్త వహించాలని, మీ వ్యక్తిగత సమాచారం గానీ, బ్యాంకు వివరాలను గానీ ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని, మద్యం తాగి వాహనం నడపకూడదని, హెల్మెట్ ధరించడం మర్చిపోవద్దన్నారు. వేసవి సెలవుల సందర్భంగా తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వారి ఆటలు కట్టించేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశామన్నారు. మీ అందరి బాధ్యత, భద్రత మా ప్రధాన ధ్యేయమని, మీ భద్రతకు జిల్లా పోలీసుశాఖ ఎళ్లవేళలా తోడుగా ఉంటుందని ఎస్పీ తెలియజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను నివారించవచ్చునని, జిల్లా పోలీసు యంత్రాంగం, పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను జిల్లా ప్రజలు తప్పకుండా పాటించాలని, మీ సహకారం మాకు ఎంతో ముఖ్యమని ఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మే 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వాటిని పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజలకు అధికారులపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి వారికి న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని, అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని తెలిపారు.

ప్రశాంతంగా నీట్

- 97 శాతం మంది హాజరు
- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సీఐలకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎన్‌టీఏ నీట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 97 శాతం మంది హాజరైనట్లు తెలిపారు. కడప, ప్రొద్దుటూరులోని మొత్తం 8 పరీక్ష కేంద్రాలలో 2371 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకోగా 2311 మంది (97శాతం) హాజరు కాగా, 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కడప నగర పరిధిలోని ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్, నాగరాజుపేట, ప్రభుత్వ జూనియర్ కలాశాల (గర్ల్స్), మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎంసీహెచ్‌ఎస్ మెయిన్, అన్నమయ్య సర్కిల్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, వైఆర్‌జడ్పీహెచ్ స్కూల్ (గర్ల్స్) పరీక్ష కేంద్రాలలో నమోదు చేసుకున్న 1839 విద్యార్థుల్లో 1788 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజ రయ్యారు. ప్రొద్దుటూరు పరిధిలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఆఫ్ యోగి వేమన యూనివర్సిటీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న 532 మంది విద్యార్థుల్లో 523 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు.

కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

కడప నగరంలోని నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నీట్ పరీక్ష కేంద్రాలైన కోటిరెడ్డి మహిళా కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలకోన్నత పాఠశా లలను ఎస్పీ సందర్శించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రా లకు వంద మీటర్ల పరిధిలో గుంపులు లేకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష నియమ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. కడపవన్ టౌన్ సీఐ బి.రామకృష్ణ, తాలూకా సీఐ టి.రెడ్డప్ప, టూటౌన్ సీఐ బి.నాగార్జున, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినులు

ఘనంగా చక్రస్నానం

పుష్పయాగం వైభవోపేతం



పెన్నానదిలో శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

వల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిట్టచివరి రోజు ఆదివారం పంచమ నదీ సంగమంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా శ్రీచక్ర స్నానం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ఉన్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వరుడు, కొండపైన చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను, త్రిశూల శ్రీచక్రాలను పవిత్ర పెన్నానది ఒడ్డుకు తీసుకువచ్చి పంచామృతాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల నడుమ నదిలో శ్రీచక్ర స్నానం చేయించారు. అనంతరం విగ్రహాలతో పాటు శ్రీచక్ర త్రిశూలాలను ఆయా దేవస్థానంవద్దకు మేళతాళాల నడుమ తీసుకెళ్లి.. మహాపూర్ణాహుతి గావించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడికి కొండపై వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించి.. గత తొమ్మిది రోజులుగా బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. చక్రస్నానంతో పాటు పుష్పయాగానికి తరలివచ్చిన భక్తులకు కార్య నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

మహానాడు పనులు ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



టెంకాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, చిత్రంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు

సీకేదిన్నె, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు వేదిక స్థలం చదును పనులను ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిలు ప్రారంభించారు. కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు. మహానాడు నిర్వహణకు పలుచోట్ల స్థలాలను పరిశీలించిన టీడీపీ నాయకులు చివరకు కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె పరిధిలోని పబ్బాపురం వద్ద స్థలాన్ని ఖరారు చేశారు. మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు వచ్చే అవకాశం ఉండటంతో దానిని దృష్టిలో ఉంచుకుని పబ్బాపురం వద్ద చెర్లోపల్లె పొలంలో రింగ్ రోడ్డుకు ఆనుకుని 120 ఎకరాల్లో స్థలాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించనున్నారు. స్థానిక నాయకుల సహకారంతో పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రింగ్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అదేవిధంగా దాదాపు 25-30 వేల వరకు వచ్చే ప్రతినిధులకు బస ఏర్పాటు చేసేందుకు కూడా సమీపంలో కల్యాణ మండపాలు విద్యాసంస్థలు ఉండడంతో ఎంతగానో అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. మహానాడు వేదిక కడప ఎయిర్‌పోర్టుకు కూడా దగ్గరగా ఉండటంతో అందరికీ అనుకూలంగా ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నేతలు కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, నాగేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన బాహుదా



బాహుదా ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

- ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువలు

నిమ్మనపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల బాహుదా ప్రాజెక్టులోని నీరు రోజురోజుకు అడుగంటిపోతుండటంతో భూగర్భజలాలు తగ్గిపోయి గ్రామాల్లో బోర్లలో నీరు రాక తాగునీటి ఎద్దడి నెలకొనే పరిస్థితి ఏర్పడింది. బాహుదా ప్రాజెక్టు సామర్థ్యం 398 ఎంసీఎఫ్‌టీలు కాగా అధికార లెక్కల ప్రకారం 2880 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి నీరు పుష్కలంగా ఉంటే తాగు, సాగునీటి ఏడాది పాటు కొరత ఉండదు. ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. కుడి కాలువ దాదాపు 1 కిలోమీటరు వరకు ఉండగా, ఎడమ కాలువ 8 కిలోమీటర్లు ఉండగా 29 స్ప్రింగ్ ఛానల్స్ ఉన్నాయి. ప్రస్తుతం కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో కాలువల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. ఈ ప్రాజెక్టు నీటి ద్వారా దాదాపు 10 గ్రామాల రైతులు లబ్ధి పొందుతారు. అంతేకాకుండా ప్రాజెక్టు నుంచి వృథాగా వెళ్లే నీరు నిమ్మనపల్లి, వాల్మీకిపురం మండలాల వరకు చేరుతుంది. అలాగే ప్రాజెక్టు నిండితే పీలేరు మండలంలోని పించా ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రస్తుతం బాహుదాలో నీటిమట్టం 162 ఎంసీఎఫ్‌టీలు ఉంటుందని అధికారులు తెలిపారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువ

ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో భూగర్భజలాలు తగ్గిపోయి పలు గ్రామాలలో ఇప్పటికే రెండు, మూడు రోజులకొకసారి తాగునీటిని వదులుతున్నారు. ఎండలు ఇలాగే కొనసాగితే తాగునీటికి కూడా కష్టంగా మారుతుంది. దీనికి తోడు బాహుదా కాలువల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తుండటంతో నీటి ఎద్దడి నెలకొంది. ప్రస్తుతం రైతులు వరి పంటలు వేయకుండా కేవలం ఉద్యాన పంటలపై మక్కువ చూపుతున్నారు. కనీసం ఉన్న కాలువలకు మరమ్మతులు చేస్తే కొంతవరకు వ్యవసాయం చేసుకునే అవకాశం కలుగుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ చూపి బాహుదా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కనపడకుండా పోయిన వ్యక్తి దారుణ హత్య





దార మునయ్య (ఫైల్)

కుళ్లిపోయి ఉన్న మృతదేహం..

ఒంటిమిట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): కనపడకుండా పోయిన వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన ఒంటిమిట్ట మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన దార మునయ్య (48) ఏప్రిల్ 28వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఏప్రిల్ 29న ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి పలుచోట్ల గాలిస్తున్నారు. ఆదివారం ఉదయం మేకలు మేపుకునేవారు అడవికి వెళుతుండగా చింతరాజుపల్లె సమీపంలోని ఎరుకులపాలెం-బోయపాళెం మధ్యలో శివాలయం వెనుక ఉన్న వంకలో ఒక మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉంది. శరీరంపై పలు గాయాలున్నాయి. తలను పూర్తిగా పగలగొట్టబడి ఉంది. మృతుడిపై ఆర్ఎస్ కేసులు కూడా నమోదై ఉన్నాయి. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జీవనోపాధికై కువైత్‌లో ఉంది. ఈ హత్యకు అక్రమ సంబంధం కారణమై ఉంటుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. విషయం తెలియడంతో సీఐ బాబు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో సంఘటన స్థలంలోనే వైద్యులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు డ్యూ చెల్లించలేక మదనపల్లె మండలంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె మండలం మేంపల్లె గ్రామం జంగాలపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు శ్రీకాంత్ (25) మదనపల్లె పట్టణంలో ఓ మార్టులో పని చేస్తూ ఇటీవలే పనిమానేశాడు. క్రెడిట్ కార్డుపై ఉన్న రూ.లక్ష అప్పులో సుమారు రూ.60వేల వరకూ చెల్లించాడు. మిగిలిన మొత్తం చెల్లించలేక పోవడంతో ప్రైవేట్ బ్యాంకు అధికారులు ఇంటి వద్దకు వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

అవమానం భరించలేక ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మామ ఇంట్లో జరిగిన దొంగతనంపై తనను అనుమానిస్తున్నట్లు బావించి ఎర్రగుంట్ల వినాయకనగర్‌కు చెందిన నూకనబోయిన ఆంజనేయులు(30) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాల్లోకెళితే.. 2025 మార్చి నెలలో ఎర్రగుంట్ల వినాయకనగర్‌లోని నాపరాయి పరిశ్రమలో పనిచేస్తున్న పీరయ్య ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. ఈ చోరీలో బంగారు ఆభరణాలు, డబ్బు, బాండ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై పోలీసులు ఇప్పటికీ విచారణ జరుపుతూనే ఉన్నారు. అయితే పీరయ్య అల్లుడైన ఆంజనేయులును అనుమానిస్తున్నట్లు వదంతులు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అతను అవమానంగా భావించి ఆదివారం మామ అయిన పీరయ్య ఇంట్లోని బాత్‌రూంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని శవం లభ్యం



పోరుమామిళ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరుమామిళ్ల చెరువులో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొండారెడ్డి సిబ్బందితో వెళ్లి బోటు సహాయంతో చెరువులో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు టీషర్టు ధరిం చి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. ఇతని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9121100631, 9121100630కు ఫోను చేయాలన్నారు.


అదుపు తప్పి ఆటో బోల్తా.. ఒకరు మృతి



మృతి చెందిన సింహాద్రి

కాశినాయన, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసనపల్లె సమీపంలో ఆదివారం టాటాఏస్ వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన షామియానా సప్లయర్స్ ఆకులనారాయణపల్లెలో జరిగిన సంవత్సరికం(వర్ధంతి) కార్యక్రమానికి టెంట్, వంట సామాన్లు వేశారు. కార్యక్రమం ముగియగానే వాటిని ఆటోలో తీసుకొని వస్తుండగా బసనపల్లె సమీపంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో సప్లయర్స్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన పెద్దవెంగయ్య కుమారుడు సింహాద్రి(18)కి తీవ్రగాయాలయ్యాయి. 108వాహనంలో పోరుమామిళ్లకు తీసుకుపోతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీకొడుకు అదృశ్యం పై కేసు నమోదు



అదృశ్యమైన గాయత్రి, అఖిల్

రామసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎర్రబోయనపల్లెకు చెందిన గంగాధర్ భార్య గాయత్రి(26), వీరి కుమారుడు అఖిల్(3)తో కలిసి ఈనెల 3వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయింది. భర్త గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్

- రూ.7లక్షల నష్టం

వాల్మీకిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. చింతపర్తి గ్రామానికి చెందిన వ్యాపారి వెంకటేష్‌శెట్టి సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని డీఎస్పీ వీధిలో వెంకటేష్‌కు సంబంధించిన సరుకుల గోడౌన్ ఉంది. ఈ గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సరుకులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సరుకులన్నీ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.7లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతా తానై..



- నియామకం ఒక చోట.. విధులు మరోచోట
- సమస్య సృష్టికర్త.. పరిష్కారకర్త ఆయనే
- డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పెత్తనం

వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే ఓ అధికారికి నియామకం ఒకచోట అయితే విధులు నిర్వర్తించేది మాత్రం మరోచోట. మరో పీహెచ్‌సీలో పనిచేస్తున్నారనుకుంటే పొరపాటే. ఏకంగా పులివెందులలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే తిష్ట వేశారు. సమస్యను తెరపైకి తెచ్చి తానే పరిష్కరిస్తూ ఉన్నతాధికారుల వద్ద మెప్పు పొందుతుంటారని పలువురు చెబుతున్నారు. అతికొద్ది కాలంలోనే తన ముద్ర వేసుకొని వైద్య సిబ్బందిని శాసించేస్థాయికి ఎదిగిపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పులివెందుల రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు (ఎఫ్ఆర్ఎస్)లో కూడా వేలుపెట్టి అందరికి ఫోన్లు చేస్తూ ఇబ్బందిపెడుతుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డులో ఉన్నామనే విషయం తెలిసి కూడా ఫోన్లు చేస్తుంటారని అంటున్నారు. నియోజకవర్గంలోని వేముల, చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాలతో పాటు పులివెందుల ఏరియా ఆసుపత్రిలో వ్యవహారాలన్నీ ఈయనే చూస్తుంటారనేది బహిరంగ రహస్యం. వీటితో పాటు పాడా ద్వారా చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణాలు, కొనుగోలు చేసిన సామగ్రిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారని పలువురు ఉద్యోగులు, సిబ్బంది అంటున్నారు. అవసరం లేని వాటిని కొనుగోలు చేసి వాటిని మూలకు చేర్చి పక్కదారి పట్టిస్తుంటారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆయనకు నచ్చితే..

ఓ ఉద్యోగిని తప్పుడు డాక్యుమెంట్లతో ఉద్యోగం పొందిందనే విషయాన్ని విలేకరులకు, పలువురికి సమాచారం ఇవ్వడం, వారు వెళ్లి ప్రశ్నించి బయటకు రాగానే.. మనవాళ్లే ఉండనీ.. అంటూ వినమ్రంగా చెప్పి ఆ సమస్యకు పరిష్కారం చూపుతుంటారని చెబుతున్నారు. జీతాలు, బిల్లుల విషయంలో సమస్యలు తెచ్చి ఆయనే పరిష్కరిస్తుంటారని వైద్య ఆరోగ్యశాఖలో ప్రచారం ఉంది. అంతేకాకుండా ఈయనకు నచ్చిన ఉద్యోగులపై తీవ్రమైన ఆరోపణలు కూడా తుడిచిపెట్టగలిగే స్థాయి ఈయనదని చెబుతారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించాల్సిన ఓ ఉద్యోగిని ఇంటి వద్ద కూర్చొని సొంత పనులు చూసుకునేలా చేయగలిగిన సత్తా ఈయనకు ఉంది. దీనిపై ఇప్పటికీ ఆరోపణలు ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలో ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ పాతుకుపోయిన వారు అనేక మంది ఉన్నారు. వీరు బదిలీల సమయంలో ఏదొక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే వారికి తన సలహాలతో ఎక్కడకు వెళ్లకుండా చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని చెబుతారు.

నివేదికలు ఇచ్చేది ఈయనే..

పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల్లో నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అనేకం ఉన్నాయి. పులివెందుల ప్రాంతంలో ఒక్కరిద్దరు తప్ప ఎవరు కూడా నిబంధనలు పాటించరనేది బహిరంగ రహస్యం. వీటిని తనిఖీలు చేయాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. వీటిపై ఆరోపణలు వచ్చినపుడు డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు ఆ సీనియర్ అసిస్టెంట్ కూడా వెళ్తారు. తనిఖీల అనంతరం ఈయన రంగంలోకి దిగి వ్యవహారం అంతా నడిపిస్తానని వారికి భరోసా ఇస్తుంటారని సమాచారం. జిల్లాస్థాయి అధికారుల వద్ద సమస్య పరిష్కారకర్త అని పేరు ఉండడంతో ఈయన తీర్పు ఫైనల్ అవుతుంది.

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏమన్నారంటే..

సీనియర్ అసిస్టెంట్ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో (పీహెచ్‌సీ) ఖాజామొయిద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పులివెందుల పరిధిలో ఆయన చాలా కాలంగా ఉంటున్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. విచారణలకు, తనిఖీలకు కొన్నిసార్లు నేను వెళ్లను ఆయననే పంపిస్తుంటాను. నా వద్ద విధులు నిర్వహించేందుకు పర్మిషన్ తీసుకున్నానని సెలవిచ్చారు. ఆ సీనియర్ అసిస్టెంట్ అంటే గిట్టని వాళ్లు చాలామంది ఉన్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో చెప్పడం కొసమెరుపు.

నేడు టాప్-10 విద్యార్థులకు సత్కారం

- ఎంఈఓలు తప్పక హాజరుకావాలి
- డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని శిల్పారామంలో ఈనెల 5వ తేదీ సాయంత్రం 4.30గంటలకు పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన టాప్-10 విద్యార్థులను విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్కరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరవుతారని అన్నారు. అలాగే వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎంఈవోలంతా తప్పకుండా హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

నేడు ప్రజావాణి

కడప,కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలోని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100ను ప్రభుత్వం ప్రారంభించిదని, అర్జీదారుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆ సమాచారం తెలుసుకోవడానికి ఈ 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

ఆశయ సాధనకు మారుపేరు భగీరథ మహర్షి

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్ష, పట్టుదలలో ఏ ప్రయత్నంలోనైనా విజయం సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగున పడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాళలలు చేపట్టడం అభినందనీయన్నారు. భగీరథ మహర్షి ఎంతటి కష్టాన్నైనా లెక్క చేయకుండా అనుకున్నది సాధించే తత్వం గలవారన్నారు. మాట్లాడుతూ భగీథ మహర్షి సేవా నిరతి గొప్పదని, ముందుగా అపర భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, బీసీ సంక్షేమశాఖాధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘం నేత అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ, రమణయ్య, మాదాసు మురళి, సుబ్బరాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కోర్టు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

- హైకోర్టు జడ్జిలకు వినతి

కడప రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో క్రిమినల్ కోర్టు భవన నిర్మాణంతో పాటు న్యాయవాదుల సంఘ భవనం పైఅంతస్తు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తిలకు కడప బార్ అసోసియేషన్ విన్నవించింది. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి తదితర కార్యవర్గ సభ్యులు నగరంలోని స్టేట్ గెస్టహౌస్‌లో న్యాయమూర్తులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. క్రిమినల్ కోర్టు నిర్మాణాలకు తగు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఈ మేరకు చర్యలను తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశారు.



హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కడప బార్ అసోసియేషన్ నాయకులు

ఆటో బోల్తా.. ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

బద్వేలుటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం రాజుపాలెం వద్ద ఆదివారం ఆటో బోల్తా పడటంతో పి.చిన్నయ్య(60) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురానికి చెందిన చిన్నయ్య ఓ పని నిమిత్తం మరో ఇద్దరితో కలసి ఆటోలో బద్వేలుకు వస్తుండగా రాజుపాలెం సమీపంలోకి రాగానే కుక్కలు అడ్డంరావడంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పి.చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహులుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. మరో మహిళ లక్ష్మీదేవికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతుడికి భార్యతో పాటు కొడుకు, కూతురు కలరు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు గ్యారేజ్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రశాంతంనగర్‌లో మహ్మద్‌రఫీకి చెందిన కారు గ్యారేజ్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదంలో రూ.లక్షకు పైగా నష్టం కలిగినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అగ్రిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో అక్కడికి చేరుకునేటప్పటికే కారు గ్యారేజ్, టాటా నెజోన్ ముందు భాగం కాలిపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో అక్రమ కట్టడాల నిలిపివేత

బ్రహ్మంగారిమఠం, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి దేవస్థానం మాడవీధుల్లో దేవస్థానానికి సమీపంలో సాధువుల అన్నదాన సత్రం గతంలో ఉండేది. సర్వే నెం.333/3లో 1.44 సెంట్లు స్థలం ప్రభుత్వ భూమి కలదు. ఇటీవల ఆ స్థలంలో కొందరు అక్రమ కట్టడాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ ఈవో వెంకటనరసయ్య పనులను ఆపివేసి వారికి నోటీసులు జారీ చేశారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఈ మధ్యకాలంలో రాత్రికి రాత్రి మళ్లీ కట్టడాలు చేపట్టారు. ఈ విషయం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి కొందరు తీసుకువెళ్లడంతో వెంటనే పనులు ఆపివేయాలని ఎండోమెంటుశాఖ అధికారి వెంకటనరసయ్యకు ఆదే శాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పనుల వద్దకు వెళ్లి అక్రమ కట్టడాలను నిలిపివేసినట్లు తెలిపారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మే 4(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రభాతసేవ, అభిషేకం, ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్ పర్సన్ శంకర బాలాజీ మాట్లాడుతూ గురుపూజా మహోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు, భోజనం, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురికావద్దు : డీఆర్వో

కడప కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, పేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ప్రజ లకు పిలుపు నిచ్చారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధికమవుతున్న తరు ణంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ డీఆర్వో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. ప్రజలను మోసగించేందుకు నేరస్తులు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నా రన్నారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్స్‌ను ఉప యోగించి ప్రభుత్వ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల పేరుతో ఫేక్ ఖాతాలు సృష్టిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ లేదా ఇతర ఉన్నతా ధికారుల ఫొటోలను ఉపయోగించి వాట్సాప్ ఖాతాను సైబర్ నేరగాళ్లు రూపొందిస్తున్నారు. ఆ ఖాతాల ద్వారా అత్యవరసంగా డబ్బు పంపండి అనే సందేశాలు పంపు తున్నారు. కొంత మంది నిజమని నమ్మి ఆ ఖాతాలకు డబ్బులు పంపుతున్నారు. అధికారుల పేరుతో వచ్చే మెసేజ్, కాల్స్‌ను నమ్మవద్దన్నారు. తెలియని లింకులు, ఫొటోలు, ఫైళ్లను ఓపెన్ చేయవద్దన్నారు. వాట్సాప్ డీపీ చూసి నమ్మవద్దని, అనుమానస్పదమైన విషయాన్ని వెంటనే స్థానిక పోలీసులకు తెలపాలన్నారు. సైబర్ నేరాల కట్టడికి ఫిర్యాదు చేయాలంటే హెల్ప్‌లైన్ నెంబరు 1930కి, లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీవోవీకి ఫిర్యాదు చేయాలని డీఆర్వో పేర్కొన్నారు.

తెలుగు తొలి ముస్లింవాద రచయిత సత్యాగ్ని

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి



సత్యాగ్ని దంపతులను సత్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీలోకంలో తొలి తెలుగు ముస్లింవాద రచయితగా షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) చిరస్మరణీయ స్థానాన్ని ఆక్రమించారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయితల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా సేవలందిస్తున్న సత్యాగ్నిని ఆయన స్వగృహంలో కలిసి ఆరోగ్యం, యోగక్షేమాలను విచారించారు. ఆ మేరకు ఆయన చేసిన సాహిత్యకృషిని కొనియాడుతూ సత్యాగ్ని దంపతులను సత్కరించారు. ముస్లింల జీవిత విధానాన్ని పరిశీలించి సమగ్ర అవగాహనతో ఆయన కథలు రాశారన్నారు. అనంతరం ఉపాధ్యక్షుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ షేక్ హుస్సేన్ ముస్లిం స్త్రీల సమస్యలను మొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన సంస్కరణవాదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కోశాధికారి కె. రెడ్డిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో గొప్ప..చేతల్లో లేదప్పా

- వైసీపీ పాలనలో అసంపూర్తిగా భవనాలు
- అన్నీ మొండి గోడలే..
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుండుపల్లె, మే4(ఆంధ్రజ్యోతి): పల్లెలకు సేవలు విస్తరిస్తున్నామని ప్రగల్భాలు పలికిన అప్పటి సీఎం జగన్ ఆచరణలో చేతులెత్తేశారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాలను నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించింది. తీరా పనులు చేపట్టాక వాటి ప్రాధాన్యతను మరిచింది. సకాలంలో నిధులివ్వక, మధ్యలో నిలిచిపేయడం నాటి పాలన నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. ఆగిపోయిన పనులను కూటమి ప్రభుత్వం అయినా సకాలంలో పూర్తి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.




ఆగిన మాచిరెడ్డిగారిపల్లె సచివాలయ నిర్మాణం... భాగంపల్లిలో మొండి గోడలతో దర్శనమిస్తున్న హెల్త్ క్లీనిక్

ఆగిపోయిన సచివాలయాల భవన నిర్మాణం

ఇంటికి చేరువుగా సేవలు లక్ష్యంతో నిర్మాణాలు చేపట్టిన సచివాలయాల భవనాల పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. మండల వ్యాప్తంగా 15 సచివాలయాల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పనులు ప్రారంభించారు. దాదాపు అన్ని సచివాలయాలు అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులే పనులు చేయడం ప్రారంభించారు. కానీ సకాలంలో జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వలన ఆరు సచివాలయాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. కొన్ని పునాదులకు, మరికొన్ని గోడల దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల సచివాలయాలు పూర్తయినా నిధులు రాకపోవడంతో ప్రారంభించలేదు.వీటిలో నియమించిన 12 మంది ఉద్యోగులకు జాబ్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. నిత్యం సర్వే అంటూ నెలల తరబడి సచివాలయాలకు తలుపులు వేస్తున్నారు. దీంతో ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పరిస్థితి చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరోగ్యం గాలికొదిలేసి..

గ్రామాల్లో వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి అరికట్టేల లక్ష్యంతో తీసుకొచ్చిన విలేజ్ క్లినిక్‌లు, కుటుంబ వైద్యులు అనే కార్యక్రమాన్ని ఆరంభంలోనే గత పాలకులు గాలికొదిలేశారు. విలేజ్ క్లీనిక్‌లో 14 రకాల వైద్య పరీక్షలు గ్రామ స్థాయిలో అందిస్తామని, ఫోన్ చేస్తే వైద్యుడు సేవలందిస్తాడని గత పాలకులు చేసిన ప్రకటనలపై ప్రజలకు నమ్మకం పోయింది. సుండుపల్లె మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో విలేజ్ హెల్త్ కీన్లిన్‌లు నిర్మించడానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది కానీ సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. మడితాడు-1, మడితాడు-2, చిన్నగొల్లపల్లి ఈ మూడు గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు ప్రారంభించలేదు. సొంతంవారిపల్లె, భాగంపల్లి, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీల్లో పునాది, గోడల దశలకే నిర్మాణాలు ఆపేశారు. ముడుంపాడు, సుండుపల్లె-2, సుండుపల్లె-3, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో పూర్తి చేశారు. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రారంభమైన వాటిని ప్రారంభించి పూర్తి కాని వాటిని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుకేదీ భరోసా?: వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని గత పాలకులు గొప్పగా ప్రకటించారు. నిర్మాణాలు పూర్తి చేయడంలో నీరు గార్చారు. భవనాలు ఉన్న చోట విత్తనం నుంచి విక్రయం వరకు సేవలు దూరమయ్యాయి. అమ్మకాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సమితులకు సైతం అప్పగించకుండా ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. సుండుపల్లె మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.

అయితే ఆరు గ్రామ పంచాయతీల్లో మాత్రమే రైతు భరోసా కేంద్రాలు పూర్తయ్యాయి. సుండుపల్లె-2, సుండుపల్లె-3, పెద్దినేని కాలువ, పొలిమేరపల్లి, వైఎస్‌పాలెం గ్రామ పంచాయతీల్లో పూర్తయ్యాయి.

మిగిలిన 9 గ్రామ పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలు పూర్తికాలేదు. జీ.రెడ్డివారిపల్లె, తిమ్మసముద్రం, సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీల్లో అద్దె భవనాల్లో ఉండి సేవలు అందించాల్సిన పరిస్థితి దాపురించింది.

అనుమతులు రాగానే ప్రారంభం

ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిలిచిపోయిన భవన నిర్మాణాలు ప్రారంభిస్తాం. పూర్తయిన భవనాలను ప్రారంభిస్తాం. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

నాగారపమ్మకు పూజలు, బోనాల సమర్పణ

సుండుపల్లె, మే4(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లి సమీపంలో వెలిసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు సమర్పించి ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సిద్దవటం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాకు గ్రామస్థులు అడ్డుకట్ట వేశారు. లింగంపల్లె, మాచుపల్లె, డేగనవారిపల్లె గ్రామాల్లో పెన్నానది నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా నిత్యం అక్రమార్కులు ఇసుక తరలిస్తుండంతో వారు ఎక్స్‌కవేటర్ సాయంతో టక్కోలి పెన్నానదికి వెళ్లే రహదారి వద్ద గోతులు తీశారు. ఇసుక తరలించడం వల్ల భూగర్భజలాలు అట్టడుగు ప్రాంతాలకు పోతున్నాయని, పంట పొలాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



ఎక్స్‌కవేటర్‌తో గోతులు తీసిన గ్రామస్థులు

ఆశ్రమానికి 30 బస్తాల వరిధాన్యం వితరణ

చిట్వేలి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిమ్మయపాలెం క్రాస్ వద్ద వెలసిన దత్తగిరి నారాయణ తపోవనం ఆశ్రమానికి 30 బస్తాల వరి ధాన్యాన్ని ఎం రాచపల్లె గ్రామస్థులు వితరణగా అందించారు. ప్రతియేటా వరిధాన్యాన్ని ఆశ్రమానికి వితరణగా అందిస్తున్నారు. ఆదివారం ఆశ్రమం ధర్మకర్త నాగేశ్వరమ్మకు రాచపల్లె గ్రామంలో వరి ధాన్యాన్ని అందించారు. ఈ సందర్భంగా రాచపల్లె గ్రామ ప్రజలను ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు. ఆశ్రమ నిర్వాహకులు పద్మావతమ్మ, శేఖర్, రాచపల్లె గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సింగనమలలో వైభవంగా యల్లమ్మ జాతర

పెనగలూరు, మండలంలోని పాత సింగనమల గ్రామంలో ఆదివారం గ్రామ దేవత యల్లమ్మ జాతర వైభవంగా జరిగింది. జాతర మహోత్సవానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రులతో సింగనమల గ్రామం రెండు రోజులు కళకళలాడింది. 40 ఏళ్ల తర్వాత గ్రామస్థులంతా ఐకమత్యంతో జాతర జరుపుకున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి ఎల్లమ్మ ఉత్సవం విగ్రహంతో కన్నుల పండువగా గ్రామోత్సవం జరిగింది. ఆదివారం అట్టహాసంగా బ్రహ్మోత్సవం జరిగింది. తెల్లవారుజామున యల్లమ్మతల్లికి పోతులను బలిచ్చి శాంతింపజేశారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి కోడిపుంజులు, మేకపోతులు, పొట్టేళ్లను బలి ఇచ్చారు.



భక్తులకు దర్శనమిస్తున్న యల్లమ్మతల్లి

ఉదయం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ్‌నాయుడు, సాంకేతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్, జనసేన నాయకులు యనమల విజయభాస్కర్, సాయంత్రం కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. వారివెంట కూటమి నాయకులు భారీగా పాల్గొన్నారు.

వేసవి తరగతులను వెంటనే రద్దు చేయాలి

లక్కిరెడ్డిపల్లె, మే4(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం వేసవిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెమెడియిన్ తరగతులను రద్దు చేయాలని పీఆర్‌డీయూ జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడునాయక్ పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయులకు తెచ్చిన బదిలీల చట్టం మాదిరిగానే పదో తరగతి ఫలితాల సాధన కోసం ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. బ్రిడ్జి కోర్స్ రూపంలో ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. సబ్జెక్టు వారీగా విద్యా వలంటీర్లను లేదా మానవతా విలువలు కలిగిన ఉపాధ్యాయులను నియమించి పారితోషికం లేదా గౌరవ వేతనాలు ఇవ్వాలన్నారు. అప్పుడే వందశాతం ఫలితాలు సాధించవచ్చునని, ఈ విధానం అమలవుతుందని ఈ సందర్భంగా వివరించారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

- టీడీపీ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా

రైల్వేకోడూరు, మే 4(ఆంధ్ర జ్యోతి): ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులోని రాజ్ కన్వెన్షన్ సెంటర్‌లో ముక్కా పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గునిపాటి రాయుడు ముక్కాకు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. భారీ ఎత్తున కేక్‌ను కత్తిరించి అభిమానులకు పంచిపెట్టారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీలను అన్నింటినీ నెరవవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కూటమి నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, యువ నాయకులు ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, తాతంశెట్టి నాగేంద్ర, పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, ఆలం రమేష్, కల్లా చలపతి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న గునిపాటి రాయుడు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- హైకోర్టు జడ్జికి బార్ అసోసియేషన్ పాలకవర్గం వినతి

నందలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదివారం కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌లో హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును నందలూరు కోర్టు నూతన భవన నిర్మాణం విషయమై చర్చించి కోర్టులో జడ్జిని నియమించమని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించి సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నరసింహులు తెలిపారు. అనంతరం హైకోర్టు జడ్జిని శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి గొబ్బిళ్ల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరి నయనపల్లె అనుదీప్ జయసింహా, ట్రెజరర్ వినయ్‌కుమార్, హస్తవరం ఆనంద్‌కుమార్, ముంగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జికి సమస్యలను వివరిస్తున్న బార్ అసోసియేషన్ పాలకవర్గం

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయం

- రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి

లక్కిరెడ్డిపల్లె, మే4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగానే రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు.

అనంతరం డీ.వడ్డెపల్లెలో కొత్త మోటారు అమర్చి తాగునీరు అందించారు. టీడీపీ కార్యకర్త లక్ష్మయ్యకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం బెస్తపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రారంభించారు. నరసింహారాజుగారిపల్లెలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి శంకరపు జయరాం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ వెంకటరామరాజు, టీడీపీ మండల యువనాయకుడు ఫక్కీరయ్య, టీడీపీ నాయకులు ధర్మరాజు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



దిన్నెపాడు గ్రామంలో సమస్యలపై ఆరా తీస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రభుత్వాసుపత్రికి 30 కుర్చీలు వితరణ

రాయచోటిటౌన్, మే4(ఆంధ్రజ్యోతి):కీర్తిశేషులు స్వర్గీయ మండిపల్లి నాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి 30 కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన సమస్యలన్నీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండిపల్లి నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి

చిన్నమండెం,మే4(ఆంధ్రజ్యోతి):తమ తండ్రి కీరిశేషులు స్వర్గీయ మండిపల్లి నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగిరెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కొబ్బరికాయ కొట్టి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ తండ్రి రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు.

క్వాంటం సిటీగా అమరావతి : నాగోతు

రాజంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : అమరావతి క్వాంటం సిటీగా ఎదగబోతోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు కూడా అన్నీ వస్తాయన్నారు. నరేంద్రమోదీ కులగణన తీసుకొచ్చారని, దీనివల్ల అందరికీ మేలు జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి అమరావతికి రావడం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ రాజధాని మాత్రమే కాదని, క్వాంటం సిటీగా ఎదగబోతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పుడే అడుగులు పడ్డాయన్నారు. అలాగే రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణయాదవ్, ఆదినారాయణ, వేల్పుల రమణ, రామయ్య, నరసింహులు, నరేంద్రవర్మ, గిరి ఆచారి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు

27 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మే4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 27 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు నియోజకవర్గంలోని యర్రావారిపాలెం, కేవీపల్లి, కలికిరి, కలకడ, గుర్రకొండ, కదిరి, పెద్దమండెం, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 55 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 27 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో రోగులను ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాజంపేట కోర్టు నూతన భవనానికి స్థలం కేటాయించండి

రాజంపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట కోర్టు నూతన భవనానికి స్థలం కేటాయించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును బార్ అసోసియేష్ సభ్యులు కోరారు. ఆదివారం వారు కడప ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన్ను కలిసి మాట్లాడుతూ రాజంపేట తహసీల్దారు కార్యాలయాన్ని రాజంపేట న్యాయ వ్యవస్థకు అప్పగించాలని కోరారు. అలాగే అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా న్యాయమూర్తి యామిని సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హనుమంత్‌నాయుడు, జి.రామచంద్రనాయుడు, జాఫర్ బాషా, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గాలివీడు వాసికి అబాకస్ విద్యలో అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు

గాలివీడు, మే4(ఆంధ్రజ్యోతి): గాలివీడు వాసి ఆర్కే అబాకస్ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏఏఏ (ట్రిపుల్ఏ) అబాకస్ వారి ఆధ్వర్యంలో అంగుళ్లియా అర్థమేటిక్స్‌పైన శిక్షణ అనంతరం ట్రిపుల్ ఏ వారి ఆధ్వర్యంలో ఈ అవార్డును అందించినట్లు రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు.



అవార్డును అందుకుంటున్న దృశ్యం

కనపడకుండా పోయిన వ్యక్తి దారుణ హత్య





దార మునయ్య (ఫైల్)

కుళ్లిపోయి ఉన్న మృతదేహం..

ఒంటిమిట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): కనపడకుండా పోయిన వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన ఒంటిమిట్ట మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన దార మునయ్య (48) ఏప్రిల్ 28వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఏప్రిల్ 29న ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి పలుచోట్ల గాలిస్తున్నారు. ఆదివారం ఉదయం మేకలు మేపుకునేవారు అడవికి వెళుతుండగా చింతరాజుపల్లె సమీపంలోని ఎరుకులపాలెం-బోయపాళెం మధ్యలో శివాలయం వెనుక ఉన్న వంకలో ఒక మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉంది. శరీరంపై పలు గాయాలున్నాయి. తలను పూర్తిగా పగలగొట్టబడి ఉంది. మృతుడిపై ఆర్ఎస్ కేసులు కూడా నమోదై ఉన్నాయి. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జీవనోపాధికై కువైత్‌లో ఉంది. ఈ హత్యకు అక్రమ సంబంధం కారణమై ఉంటుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. విషయం తెలియడంతో సీఐ బాబు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో సంఘటన స్థలంలోనే వైద్యులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్ర జ్యోతి): క్రెడిట్ కార్డు డ్యూ చెల్లించలేక మదనపల్లె మండలంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె మండలం మేంపల్లె గ్రామం జంగాలపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు శ్రీకాంత్ (25) మదనపల్లె పట్టణంలో ఓ మార్టులో పని చేస్తూ ఇటీవలే పనిమానేశాడు. క్రెడిట్ కార్డుపై ఉన్న రూ.లక్ష అప్పులో సుమారు రూ.60వేల వరకూ చెల్లించాడు. మిగిలిన మొత్తం చెల్లించలేకపోవడంతో ప్రైవేట్ బ్యాంకు అధికారులు ఇంటి వద్దకు వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

కలకడ, మే 4(ఆంధ్రజ్యోతి): మహల్ క్రాస్‌కు సమీపంలోని ఎంఆర్ఎం డాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి షేక్ రెడ్డి ఖాదర్‌బాషా (29) మృతి చెందినట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నడిమిచర్లకి చెందిన మురాషా కుమారుడు షేక్ రెడి ఖాదర్‌బాషా బాలయ్యగారిపల్లి సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. మృతుడు శనివారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం కలికిరి మండలం మహల్‌కు వెళ్లి తిరిగి దిచక్రవాహనంలో ఇంటి వస్తుండగా ముందు వెళ్లుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని క్రింద పడడంతో తలకు గాయమైందన్నారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు తరలించగా అక్కడ ఫలితం లేక తిరిగి వచ్చి మహల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. అతని తల్లి సిరాజున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు. కాగా మృతుడికి భార్య ఆఫీజున్, కుమారులు అక్మల్ (5), పర్హన్ (3) వున్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం



పోరుమామిళ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలం లోని పోరుమామిళ్ల చెరువులో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొండారెడ్డి సిబ్బందితో వెళ్లి బోటు సహాయంతో చెరువులో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే 912110063కు ఫోను చేయాలని ఎస్ఐ అన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా.. ఒకరు మృతి



మృతి చెందిన సింహాద్రి

కాశినాయన, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసనపల్లె సమీపంలో ఆదివారం టాటాఏస్ వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన షామియానా సప్లయర్స్ ఆకులనారాయణపల్లెలో జరిగిన సంవత్సరికం(వర్ధంతి) కార్యక్రమానికి టెంట్, వంట సామాన్లు వేశారు. కార్యక్రమం ముగియగానే వాటిని ఆటోలో తీసుకొని వస్తుండగా బసనపల్లె సమీపంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో సప్లయర్స్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన పెద్దవెంగయ్య కుమారుడు సింహాద్రి(18)కి తీవ్రగాయాలయ్యాయి. 108వాహనంలో పోరుమామిళ్లకు తీసుకుపోతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీకొడుకు అదృశ్యం పై కేసు నమోదు





అదృశ్యమైన గాయత్రి, అఖిల్


రామసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎర్రబోయనపల్లెకు చెందిన గంగాధర్ భార్య గాయత్రి(26), వీరి కుమారుడు అఖిల్(3)తో కలిసి ఈనెల 3వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయింది. భర్త గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్

● రూ.7లక్షల నష్టం

వాల్మీకిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. చింతపర్తి గ్రామానికి చెందిన వ్యాపారి వెంకటేష్‌శెట్టి సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని డీఎస్పీ వీధిలో వెంకటేష్‌కు సంబంధించిన సరుకుల గోడౌన్ ఉంది. ఈ గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సరుకులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సరుకులన్నీ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.7లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతా తానై..



● నియామకం ఒక చోట.. విధులు మరోచోట
● సమస్య సృష్టికర్త.. పరిష్కారకర్త ఆయనే
● డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పెత్తనం

వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే ఓ అధికారికి నియామకం ఒకచోట అయితే విధులు నిర్వర్తించేది మాత్రం మరోచోట. మరో పీహెచ్‌సీలో పనిచేస్తున్నారనుకుంటే పొరపాటే. ఏకంగా పులివెందులలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే తిష్ట వేశారు. సమస్యను తెరపైకి తెచ్చి తానే పరిష్కరిస్తూ ఉన్నతాధికారుల వద్ద మెప్పు పొందుతుంటారని పలువురు చెబుతున్నారు. అతికొద్ది కాలంలోనే తన ముద్ర వేసుకొని వైద్య సిబ్బందిని శాసించేస్థాయికి ఎదిగిపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పులివెందుల రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు (ఎఫ్ఆర్ఎస్)లో కూడా వేలుపెట్టి అందరికి ఫోన్లు చేస్తూ ఇబ్బందిపెడుతుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డులో ఉన్నామనే విషయం తెలిసి కూడా ఫోన్లు చేస్తుంటారని అంటున్నారు. నియోజకవర్గంలోని వేముల, చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాలతో పాటు పులివెందుల ఏరియా ఆసుపత్రిలో వ్యవహారాలన్నీ ఈయనే చూస్తుంటారనేది బహిరంగ రహస్యం. వీటితో పాటు పాడా ద్వారా చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణాలు, కొనుగోలు చేసిన సామగ్రిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారని పలువురు ఉద్యోగులు, సిబ్బంది అంటున్నారు. అవసరం లేని వాటిని కొనుగోలు చేసి వాటిని మూలకు చేర్చి పక్కదారి పట్టిస్తుంటారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆయనకు నచ్చితే..

ఓ ఉద్యోగిని తప్పుడు డాక్యుమెంట్లతో ఉద్యోగం పొందిందనే విషయాన్ని విలేకరులకు, పలువురికి సమాచారం ఇవ్వడం, వారు వెళ్లి ప్రశ్నించి బయటకు రాగానే.. మనవాళ్లే ఉండనీ.. అంటూ వినమ్రంగా చెప్పి ఆ సమస్యకు పరిష్కారం చూపుతుంటారని చెబుతున్నారు. జీతాలు, బిల్లుల విషయంలో సమస్యలు తెచ్చి ఆయనే పరిష్కరిస్తుంటారని వైద్య ఆరోగ్యశాఖలో ప్రచారం ఉంది. అంతేకాకుండా ఈయనకు నచ్చిన ఉద్యోగులపై తీవ్రమైన ఆరోపణలు కూడా తుడిచిపెట్టగలిగే స్థాయి ఈయనదని చెబుతారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించాల్సిన ఓ ఉద్యోగిని ఇంటి వద్ద కూర్చొని సొంత పనులు చూసుకునేలా చేయగలిగిన సత్తా ఈయనకు ఉంది. దీనిపై ఇప్పటికీ ఆరోపణలు ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలో ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ పాతుకుపోయిన వారు అనేక మంది ఉన్నారు. వీరు బదిలీల సమయంలో ఏదొక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే వారికి తన సలహాలతో ఎక్కడకు వెళ్లకుండా చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని చెబుతారు.

నివేదికలు ఇచ్చేది ఈయనే..

పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల్లో నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అనేకం ఉన్నాయి. పులివెందుల ప్రాంతంలో ఒక్కరిద్దరు తప్ప ఎవరు కూడా నిబంధనలు పాటించరనేది బహిరంగ రహస్యం. వీటిని తనిఖీలు చేయాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. వీటిపై ఆరోపణలు వచ్చినపుడు డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు ఆ సీనియర్ అసిస్టెంట్ కూడా వెళ్తారు. తనిఖీల అనంతరం ఈయన రంగంలోకి దిగి వ్యవహారం అంతా నడిపిస్తానని వారికి భరోసా ఇస్తుంటారని సమాచారం. జిల్లాస్థాయి అధికారుల వద్ద సమస్య పరిష్కారకర్త అని పేరు ఉండడంతో ఈయన తీర్పు ఫైనల్ అవుతుంది.

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏమన్నారంటే..

సీనియర్ అసిస్టెంట్ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో (పీహెచ్‌సీ) ఖాజామొయిద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పులివెందుల పరిధిలో ఆయన చాలా కాలంగా ఉంటున్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. విచారణలకు, తనిఖీలకు కొన్నిసార్లు నేను వెళ్లను ఆయననే పంపిస్తుంటాను. నా వద్ద విధులు నిర్వహించేందుకు పర్మిషన్ తీసుకున్నానని సెలవిచ్చారు. ఆ సీనియర్ అసిస్టెంట్ అంటే గిట్టని వాళ్లు చాలామంది ఉన్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో చెప్పడం కొసమెరుపు.

నేడు టాప్-10 విద్యార్థులకు సత్కారం

● ఎంఈఓలు తప్పక హాజరుకావాలి
● డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని శిల్పారామంలో ఈనెల 5వ తేదీ సాయంత్రం 4.30గంటలకు పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన టాప్-10 విద్యార్థులను విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్కరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరవుతారని అన్నారు. అలాగే వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎంఈవోలంతా తప్పకుండా హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

నేడు ప్రజావాణి

కడప,కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలోని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100ను ప్రభుత్వం ప్రారంభించిదని, అర్జీదారుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆ సమాచారం తెలుసుకోవడానికి ఈ 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

ఆశయ సాధనకు మారుపేరు భగీరథ మహర్షి

● జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్ష, పట్టుదలలో ఏ ప్రయత్నంలోనైనా విజయం సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగున పడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారిఆదర్శాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయన్నారు. భగీరథ మహర్షి ఎంతటి కష్టాన్నైనా లెక్క చేయకుండా అనుకున్నది సాధించే తత్వం గలవార న్నారు. మాట్లాడుతూ భగీథ మహర్షి సేవా నిరతి గొప్పదని, ముందుగా అపర భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, బీసీ సంక్షేమశాఖాధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘం నేత అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ, రమణయ్య, మాదాసు మురళి, సుబ్బరాయుడు, రామచంద్ర పాల్గొన్నారు.

పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం

● ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌తో పాటు ఆయన కుటుంబీకులకు గాయాలు

ములకలచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌తో పాటు ఆయన కుటుంబీకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువులోని వినాయకనగర్‌లో నివాసమున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ మయిన్‌బాషా, ఆయన భార్య షాహీన్ తాజ్, కుమారుడు అక్మల్ పని నిమిత్తం కారులో మదనపల్లెకు వెళ్ళారు. తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గంమధ్యంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వీరి కారును ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మయిన్‌బాషాతో పాటు భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు గ్యారేజ్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రశాతంనగర్‌లో మహ్మద్‌రఫీకి చెందిన కారు గ్యారేజ్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమా దంలో రూ.లక్షకు పైగా నష్టం కలిగినట్లు బాధితుడు తెలి పారు. సమాచారం తెలుసుకున్న అగ్రిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో అక్కడికి చేరుకునేటప్పటికే కారు గ్యారేజ్, టాటా నెజోన్ ముందు భాగం కాలిపోయింది. వెం టనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేశారు.

వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురికావద్దు : డీఆర్వో

కడప కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, పేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధిక మవుతున్న తరు ణంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ డీఆర్వో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ను మోసగించేందుకు నేరస్తులు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నారన్నారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్స్‌ను ఉపయోగించి ప్రభుత్వ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల పేరుతో ఫేక్ ఖాతాలు సృష్టిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ లేదా ఇతర ఉన్నతా ధికారుల ఫొటోలను ఉపయోగించి వాట్సాప్ ఖాతాను సైబర్ నేరగాళ్లు రూపొందిస్తున్నారు. ఆ ఖాతాల ద్వారా అత్యవసరంగా డబ్బు పంపం డి అనే సందేశాలు పంపుతున్నారు. కొంత మంది నిజమ ని నమ్మి ఆ ఖాతాలకు డబ్బులు పంపుతున్నారు. అధికారుల పేరుతో వచ్చే మెసేజ్, కాల్స్‌ను నమ్మవద్దన్నారు. తెలియని లింకులు, ఫొటోలు, ఫైళ్లను ఓపెన్ చేయవద్దన్నారు. వాట్సాప్ డీపీ చూసి నమ్మవద్దని, అనుమానస్పదమైన విషయాన్ని వెంటనే స్థానిక పోలీసులకు తెలపాలన్నారు. సైబర్ నేరాల కట్టడికి ఫిర్యాదు చేయాలంటే హెల్ప్‌లైన్ నెంబరు 1930కి, లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీవోవీకి ఫిర్యాదు చేయాలని డీఆర్వో పేర్కొన్నారు.

లుకవుట్ నోటీసులపై ఒకరి అరెస్టు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కురబలకోట, మే 4(ఆంధ్రజ్యోతి): లుకవుట్ నోటీస్ జారీ కేసులో నిందితుడు అరెస్ట్ చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగళ్లులో ఎస్ఐ బ్రాంచ్‌లో గతంలో పని చేస్తున్న గాయత్రి 2021లో రామకృష్ణపై ఫిర్యాదు చేయగా అతనిపై వరకట్న కేసు నమోదైంది. దీంతోఆయన దుబాయ్‌కు వెళ్ళిపోయాడు. అక్కడి నుంచి తిరిగి ఇక్కడికి రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతనిపై లుకవుట్ నోటీసులు ఉండటంతో అతడిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని ముదివేడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ముదివేడు పోలీసులు అక్కడికి వెళ్ళి అతడిని అదుపులోకి తీసుకుని ఇక్కడికి తరలించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు త్రీమెన్ కమిటీ విచారణ

● కలికిరి ఉన్నత పాఠశాల వివాదంపై
జాతీయ బాలల హక్కుల కమిషన్ జోక్యంతో మరో ట్విస్ట్
● ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదును ఉపసంహరించుకున్న ఉపాధ్యాయుడు

కలికిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన వివాదం పలు మలుపులు తిరుగుతోంది. ఆ పాఠశాలలో పనిచేసే ఒక ఉపాధ్యాయునికి సీసీఎల్ (చైల్డ్ కేర్‌టేకర్ లీవ్) మంజూరు విషయంలో హెచ్‌ఎంకు, ఉపాధ్యాయుడికి మధ్య నెలకొన్న వివాదం ఇప్పటికే వాయల్పాడు కోర్టు లీగల్ సర్వీస్ జోక్యం సమసిపోగా తాజాగా జాతీయ బాలల హక్కుల కమిషన్ ఇదే పాఠశాలకు చెందిన మరో వివాదంలో జోక్యం చేసుకుని కలెక్టరుకు నోటీసులు జారీ చేసింది. ఉపాధ్యాయుడి సెలవు మంజూరు విషయంలో నెలకొన్న వివాదానికి సంబంధించిన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించి సమగ్ర కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. ఫలితంగా సోమవారం త్రీమెన్ కమిటీ ఈ వివాదంపై విచారణ జరిపేందుకు హెచ్‌ఎంకు, ఉపాధ్యాయుడికి నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. ముగ్గురు ఎంఈవోలతో కూడిన విచారణ కమిటీని నియమించినా విచారణలో జాప్యం జరగడాన్ని ఈ కథనంలో ప్రస్తావించడంతో సోమవారం విచారణ కోసం త్రీమెన్ కమిటీ సిద్ధమైంది. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విచారణకు హాజరు కావలసిందిగా ఆదేశిస్తూ విచారణ కమిటీ తరఫున కలికిరి ఎంఈవో హెచ్‌ఎంకు, ఉపాధ్యాయుడికి నోటీసులు జారీ చేశారు.

బాలల హక్కుల కమిషన్ జోక్యం

తాజా పరిణామాల నేపథ్యంలో కలికిరి ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు హరించబడుతున్నాయనే ఆరోపణలతో ఒక సామాజిక కార్యకర్త జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో దీనికి కమిషన్ స్పందించి సమగ్ర విచారణ కోసం కలెక్టరుకు నోటీసులు జారీ చేసింది. హెచ్‌ఎం ప్రోద్బలంతో కలికిరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించారనేది ఇందులో ప్రధాన ఆరోపణ. ఈ కారణంగా విద్యార్థుల చదువులను ప్రభావితం చేస్తుందని కమిషన్ జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కమిషన్ అత్యవసర జోక్యం అనివార్యమవుతోందని కూడా కమిషన్ అధ్యక్షుడు రాజేష్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకునేందుకు వాస్తవ విషయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లోగా కమిషన్‌కు పంపాలని కలెక్టరుకు సూచించారు. బాధిత పిల్లలను కూడా వెంటనే రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచాలని కూడా కమిషన్ పేర్కొంది. బాధితులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌ను పంపాలని ఆదేశించింది. దీనిపై కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరును వివరణ కోరగా తమకు ఇంత వరకూ ఎలాంటి ఫిర్యాదు అందని కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. ఉపాధ్యాయుడి సెలవు మంజూరు విషయంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత సిమెంటు ఇటుకలు మోయిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో గత వారం రోజులుగా రచ్చ చేస్తున్నాయి. వీటి ఆధారంగానే బాలల హక్కుల కమిషన్ కలెక్టరుకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

ఉపాధ్యాయుడి ఫిర్యాదు ఉపసంహరణ

సీసీఎల్ మంజూరు విషయంలో తనకు హెచ్‌ఎం అన్యాయం చేస్తోందని గత వారం పాఠశాలలో పనిచేసే దేవీప్రసాద్ అనే తెలుగు భాషోపాధ్యాయుడు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని కలెక్టరు ఆదేశించడంతో ఉపాధ్యాయుడు దేవీప్రసాద్‌ను కలికిరి ఎంఈవో కరీముల్లా శుక్రవారం విచారించారు. అయితే తన ఫిర్యాదును, ఆరోపణలను ఉపసంహరించుకున్నట్లు విచారణ సందర్భంగా ఉపాధ్యాయుడు వ్రాతపూర్వకంగా ఇచ్చినట్లు సమాచారం.

మరుగుకు పరుగు

- ప్రతిపాదనలకే పరిమితమైన పబ్లిక్ టాయిలెట్స్
- సమస్యను పట్టించుకోని అధికారులు
- మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


పీలేరు పట్టణం

పీలేరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో పీలేరు ఒకటి. ఇక్కడ 60 వేలకు పైగా జనాభా జీవిస్తున్నారు. దైనందిన కార్యక్రమాలపై రోజూ పట్టణానికి 10 వేల మందికి పైగా వచ్చి వెళుతుంటారు. ఇప్పటివరకు పీలేరు పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ. ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. అయినా పాలకులు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఆదాయం జాస్తి...వసతుల కల్పనలో పంచాయతీ అధమంగా ఉందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పీలేరు పట్టణంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వందల సంఖ్యలో వ్యాపార, వస్త్ర సముదాయాలు, ఆసుపత్రులు, పెద్ద సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజూ రోజువారీ కార్యక్రమాలలో భాగంగా వేలాది మంది విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, రోగులు, మహిళలు, ప్రయాణీకులు పీలేరుకు వచ్చి వెళుతుంటారు. అరకొర వసతులతో ఆర్టీసీ బస్‌స్టేషన్ మినహా ఇంకెక్కడా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం. దీంతో జనం మరుగు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ తమ పని కానిచ్చేస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధుల ఇక్కట్లు వర్ణనాతీతం. పట్టణంలో ఎటిఎస్ మార్గం ప్రారంభం నుంచి చివరి వరకూ, కడప మార్గం పొడవునా షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, విద్యాసంస్థలు ఇలా అనేకం ఉన్నాయి. ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వారపు సంతలోనూ.....

పీలేరు గ్రామ పంచాయతీకి పన్నుల తరువాత ప్రధాన ఆర్థిక వనరు ప్రతి మంగళవారం జరిగే వారపు సంత. వారం వారం వేలాదిమంది వారపుసంతకు వచ్చి కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు తీసుకెళుతుంటారు. అయితే ఇక్కడ సైతం సంతకు వచ్చే వారి అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రధానంగా మహిళా వ్యాపారులు, మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. వారపు సంతలో అరకొరగా నిర్మించిన మరుగుదొడ్ల మెయిన్‌టెన్స్ అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం. దశాబ్ద కాలంగా టాయిలెట్స్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం కావడం అధికారులు, పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం.

ప్రధానంగా పీలేరు పట్టణంలో క్రాస్‌రోడ్ (నాలుగు రోడ్ల కూడలి), అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్‌స్టేషన్, అజంతా మిట్ట, పాతబస్టాండ్ ఏరియాలలో జనం నిత్యం సందడిగా ఉంటారు. మరోవైపు పాతబస్టాండ్‌లో దినసరి కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. ఇక్కడ మహిళా వ్యాపారులే ఎక్కువ మంది ఉంటారు. అయితే కనీసం ఇక్కడ కూడా మరుగుదొడ్లు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం పడుతోంది. పంచాయతీ పాలకవర్గం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది.

స్థల సమస్య ఉన్నందునే....



పట్టణంలో అనువైన ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాల్సి ఉంది. అయితే స్థల సమస్య వల్ల ఆ దిశగా ముందుకు పోలేక పోతున్నాం. స్థలం ఉంటే వెంటనే మరుగుదొడ్లు నిర్మిస్తాం. అధికారులతో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటాం.

- గురుమోహన్, పంచాయతీ కార్యదర్శి, పీలేరు.

వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలి



పీలేరు పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పంచాయతీ పాలకవర్గం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జనం ఇక్కట్లు ఇబ్బందికరంగానే ఉంది.

- ఖాదర్, బండ్లవంక, పీలేరు.

పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం....



దినదిన ప్రవర్ధమానంగా పీలేరు పట్టణం అభివృద్ధి చెందుతోంది. రోజూ ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి వెళుతుంటారు. కనీసం మరుగు లేకపోవడం వల్ల వృద్ధులు, మహిళలు పడే బాధ వర్ణనాతీతం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- నగిరిమడుగు సుభాష్, టీడీపీ నేత, పీలేరు.

నేటి నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, మే4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీభవన్ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిం చారు. 5న సోమవారం గణపతి పూజ, స్వస్తి వాచనం, నవగ్రహారాధన, పంచామృతాభిషేకం, సాయంత్రం కుంకుమార్చన 6వ తేదీన ఉదయం సుప్రభాతం, నిత్యకైంకర్యాలు, మహా మంగళహారతి, వి డాన్స్ అకాడమీ శరణ్, వంశీ మాస్టర్ల ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శ నలు, 7వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం పుష్పపల్లకి ఊరేగింపు, 8న శయనో త్సవం, 9న అభిషేకాలు ప్రత్యేక పూజలతో అమ్మవారి జయంతి వేడకులు ముగుస్తాయని తెలిపారు. ప్రతి ఒక ఆర్యవైశ్యులు తప్పక జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బిస్మిల్లా ఆటో యూనియన్‌కు శ్రామిక శక్తి అవార్డు


శ్రామిక శక్తి అవార్డు అందుకుంటున్న బోదేషావలి

పీలేరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషావలి శ్రామిక శక్తి అవార్డు అందుకున్నారు. ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో జరిగిన సమా వేశంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్యాం బాబు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా బోదేశావల్లీ పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆటో కార్మికుల సం క్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తాము చేస్తున్న సేవలను గుర్తించి శ్రామిక శక్తి అవార్డు ఇచ్చారని తెలిపారు. ఈ అవార్డు ఆటో కార్మికులందరికీ అంకితం చేస్తున్నట్లు చెప్పారు. నిత్యం రెక్కల కష్టంతో చాలీచాలని సంపాదనతో జీవిస్తున్న ఆటో కార్మికులకు ఇంటి పట్టాలు, ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. బిస్మిల్లా ఆటోయూనియన్‌కు శ్రామిక శక్తి అవార్డు రావ డంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రత్నకుమార్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణప్ప

పీలేరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరు సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎడాపెడా అప్పులు చేసి మోయలేని భారాన్ని ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కలసి ఎన్నికల్లో 176 హామీలు ఇచ్చాయని, అయితే అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. యువగళం పేరుతో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి హామీ అమలుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఇంకా అమలు కాలేదని విమర్శించారు. అన్న దాత సుఖీభవ పేరిట ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేల హామీ ఆచరణకు ఆమడ దూరంలో ఉందన్నారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు నియంత్రించి, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శించారు. పహల్గాంలో 26 మంది టూరిస్టులను పాక్ ముష్కరులు అతి కిరాతకంగా కాల్చి చంపడం హేయమైన చర్యగా అభి వర్ణించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి టీ.ఎల్. వెంకటేష్, ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, రమేష్, రెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగశ్రీ సర్టిఫికెట్ల ప్రదానం


యోగశ్రీ సర్టిఫికెట్ అందిస్తున్న డాక్టర్ పీవీఎస్ లక్ష్మి

పీలేరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో స్థానిక దివ్యయోగ విద్యాలయంలో నిర్వహించిన యోగ శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యాలయ అధ్యక్షురాలు డాక్టర్ పీవీఎస్ లక్ష్మి శిక్షణ పొందినవారికి యోగశ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిబిరంలో కలికిరి సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 200 మంది, వీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు 30 మంది, శ్రీభువన పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులతోపాటు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన ప్రద్యుమ్న అనే విద్యార్థి శిక్షణ పొందారు.

7 నుంచి బహుజన సంకల్ప సభలు

మదనపల్లె అర్బన్, మే4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి బహుజన సంకల్ప సభలు నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ- ఉత్తర ధ్రువాలను కలుపుతూ హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 7న హిందూపురంలో ప్రారంభమయ్యే సభలు 31 నాటికి శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మదనపల్లె పట్టణంలోని బహుజన సమాజ్‌పార్టీ కార్యాలయంలో బహుజన సంకల్ప సభల పోస్టర్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయంగా బహుజనులను చైతన్యపరుస్తున్నారు. ప్రజలకు అన్ని విధాల న్యాయం జరగాలంటే బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉలవల గంగమ్మ జాతర


అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తున్న భక్తులు

పీలేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉలవల గంగమ్మ జాతర సందర్భంగా తలపుల గ్రామంలోని ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించుకోవడమే కాకుండా మొక్కులు తీర్చుకున్నారు. పీలేరు, తలపుల, కేవీపల్లె, యల్లమంద ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. జాతరలో భాగంగా ఆదివారం రాత్రి ప్రొద్దుటూరుకు చెందిన వెంకటసాయి కళాకారుల బృందం భక్త చింతామణి నాటకం ప్రదర్శించింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు పంపుకోవాలని ఎంపీడీవో భానుమూర్తి రావు కోరారు. ఉమ్మడి కడప జిల్లాలోని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిస్టియన్‌లు రుణాలకు అర్హులని తెలిపారు. ముస్లిం లకు రూ.లక్ష నుంచి 8 లక్షల వరకూ, క్రిస్టియన్ లకు రూ.5 లక్షల వరకూ రుణ సదుపాయం ఉంటుందన్నారు. ఎంపికైన వారికి రుణంలో 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందన్నారు. అర్హత కలిగిన ఔత్సాహికులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవచ్చునని తెలిపారు. ఇతర సందేహాలు, వివరాల కోసం కడపలోని ఉమ్మడి జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుకు 08562241137కు గానీ లేదా 9290448452 నంబరుకుగానీ ఫోను చేసి నివృత్తి చేసుకోవచ్చని ఎంపీడీవో వివరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


గురువులకు సన్మానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

గుర్రంకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 1985-86వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆ సమయంలో చేసిన అల్లరి, ఆటలను గుర్తు చేసుకున్నారు. అప్పటిలో ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణను నెమరువేసుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. అనారోగ్యంతో ఉన్న ఇద్దరు స్నేహితులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముక్తార్‌అలీఖాన్, సుంకరశేఖర్ పాల్గొన్నారు.

మిట్స్‌లో 11న మోడల్ ఈఏపీసెట్

కురబలకోట, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 11న మోడల్ ఈఏపీసెట్‌ను నిర్వహించనున్నట్లు కరెస్పాండెంట్ విజయభాస్కర్‌చౌదరి, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఎంపీసీ పూర్తైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8712655132,134,138 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మదనపల్లె డీవైఈవోగా లోకేశ్వరరెడ్డి



పీలేరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పీలేరులోఎంఈవో-1గా పనిచేస్తున్న లోకేశ్వర్ రెడ్డిని మదనపల్లె డీవైఈవోగా నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. మదన పల్లెలో డీవైఈవోగా పనిచేస్తున్న కృష్ణప్ప బదిలీపై తిరుపతికి వెళ్లారు. ఫుల్ అడిష నల్ చార్జ్ ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పీలేరులో ఎంఈవో-1గా పనిచేస్తున్న లోకే శ్వరరెడ్డిని నియమించింది. యూటీఎఫ్, ఎస్టీయూ, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

'మార్కెట్'కు అనుగుణంగా మామిడి కోతలు ప్రారంభించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు

పీలేరు, మే 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోతలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి(డీహెచ్‌వో) రవిచంద్ర బాబు మామిడి రైతులకు సూచించారు. తలపుల గ్రామంలోని అన్నమయ్య రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మామిడి విక్రేతలు, కొనుగోలుదారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితులను అవగాహన చేసుకోకుండా రైతులందరూ ఒకేసారి కోతలు కోయడం వల్ల ధరలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఉద్యాన శాఖాధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, దినపత్రికల ద్వారా మార్కెట్ స్థితిగతులను తెలుసుకుని కోతలు చేయాలన్నారు. పండ్లను తొడిమలతో సహా కోయడం ద్వారా మంచి ధరలు సాధించుకోవచ్చునన్నారు. ప్రస్తుతం మామిడి పరిరక్షణ కోసం మిథైల్ యూజీనాల్ కలిగిన లింగాకర్షక బుట్టలను భూమి నుంచి 5-6 అడుగుల ఎత్తులో ఎకరానికి 5-6 అమర్చుకోవాలన్నారు. పంట కోత సమయానికి మూడు వారాల ముందు ఎకరా తోటకు లీటరు నీటిలో 0.5 మిల్లీల డెల్టామెత్రిన్, 2 మిల్లీల 3000 పీపీఎం కలిగిన అజాడిరెక్టిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. లేకుంటే లీటరు నీటిలో 100 గ్రాముల బెల్లం, 2 మిల్లీల డెల్టామెత్రిన్ కలిపి విషపు ఎర తయారు చేసుకుని పొలంలో అక్కడక్కడా అమర్చుకోవాలన్నారు. టేబుల్ వెరైటీ కాయలు నిమ్మకాయల సైజులో ఉన్నప్పటి నుంచి ఫ్రూట్ కవర్స్ వాడడం వల్ల పండు ఈగ, కాయ తొలుచు పురుగు, తామర పురుగుల నుంచి కాపాడుకోవడమే కాకుండా పురుగు మందుల అవశేషాలను కూడా తగ్గించవచ్చునన్నారు. కవర్ల వల్ల కాయ రంగు, నాణ్యత, పరిమాణం పెరగడమే కాకుండా ఎండ తాకిడి నుంచి రక్షణ లభిస్తుందని, ఇటువంటి పండ్లకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. పంట కోతకు ఒక నెల ముందు నీటి తడులను పూర్తిగా ఆపివేయాలని, తద్వారా కాయలో చక్కెర శాతం, తీపిదనం, నిల్వ సామర్థ్యం పెరిగి దూరప్రాంతాల రవాణాకు అనుకూలంగా ఉంటుందన్నారు. గ్లోబల్ ఫ్యాక్టరీ ప్రతినిధి చంద్రమౌళి మాట్లాడుతూ కాయలను ఒకేసారి కోయకుండా, దశల వారీగా పక్వానికి వచ్చిన కాయల్ని కోయాలని రైతులకు సూచిం చారు. అన్నమయ్య రైతు సంఘం అధ్యక్షుడు జయబ్బ నాయుడు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ఆదివారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించామని, రైతులకు మంచి ధరలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు హెచ్‌వో సుకుమార్ రెడ్డి, డీవీఎంసీ సభ్యులు బోదేషావలి, ఆర్ఎస్‌కే సిబ్బంది జహీర్, పీలేరు, తలపుల, యల్లమంద ప్రాంతాల్లోని పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలి


జెండా ఆవిష్కరిస్తున్న మై ఫోర్స్ మహేష్, భవ్యకిషోర్

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మై ఫోర్స్ మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం జనసేన పార్టీ నాయకురాలు జయభవ్యా కిశోర్ ఆధ్వర్యంలో మదనపల్లె- పుంగనూరు బైపాస్ రోడ్డులో కొండామరిపల్లె సర్కిల్ వద్ద జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ, చెట్టు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మై ఫోర్స్ మహేష్ మాట్లాడుతూ రాబోవు ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోజు కొండామరిపల్లె సర్కిల్ జనసేన పార్టీ జెండానుఆవిష్కరించామని, రాబోవు రోజుల్లో ప్రతి గ్రామపంచాయతీల్లో పార్టీ జెండా ఎగరవేయడానికి శ్రమించాలన్నారు. జయభవ్య కిశోర్‌ను కొండామరిపల్లె గ్రామ ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తంబళ్లపల్లె జనసేన పార్టీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి అడపా సురేంద్ర, చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అమరనారాయణ, మదనపల్లె జనసేన పార్టీ నాయకులు తోట కల్యాణ్, చిత్తూరు జిల్లా కార్యదర్శి రమణ, బోయకొండ ఆలయ మాజీ ఛైర్మన్ శివప్పనాయుడు, రాజంపేట నాయకులు రెడ్డిరాణి, రమా శ్రీనివాసులు, రవి, సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ సేతు, జనసేన నాయకులు సల్మాన్, అయ్యప్ప, రాజశేఖర్, షాబీర్, సందీప్‌రెడ్డి, మనోజ్, నరేష్ నాగేంద్ర, రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా.. : ఎమ్మెల్యే నల్లారి

గుర్రంకొండ, మే 4(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీలో ఆదివారం టీడీపీ కార్యకర్త ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికా రంలోకి రావడానికి కృషి చేసిన నాయకులు, కార్య కర్త లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. నాయ కులు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథ కాలు అందేలా చూడాలని తెలిపారు. జగదీష్‌కుమార్, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, మేకల చలపతి, ప్రదీప్, చంద్రబాబు, నౌషాద్‌అలీ, ఆనంద్, సుధాకర్, బయ్యారెడ్డి, ఎస్. వెంకటరమణ పాల్గొన్నారు.

వాల్మీకిపురం : వాల్మీకిపురం పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు సయ్యద్ కుమార్తె వివాహానికి ఆదివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక మార్కెట్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశ మయ్యారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు సూచించారు. మూడో తరగతిలో 40 సీట్లు ఉండగా ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1 , 4వ తరగతిలో 37, 5వ తరగతిలో 30, 6వ తరగతిలో28, 7వ తరగతిలో 22, 8వ తరగతిలో22, 9వ తరగతిలో 22 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.వివరాలకు 9490601554 సెల్ నెంబరుకు సంప్రదించాలన్నారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణ ఫీజులో రాయితీ

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీ దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ పరిధిలో గృహ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని మదనపల్లె డివిజన్ విద్యుత్ సంస్థ ఈఈ గంగాధరం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల అనుగుణంగా అదనపు లోడు క్రమబద్ధీకరణ ఈ ఏడాది మార్చి 31 నుంచి జూన్ 30 తేదీలోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటే 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు.